క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి అంశాల ఆమోదం నిమిత్తం ఈ సమావేశంలో సభ్యుల ముందుంచడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరుకావాలని చైర్‌పర్సన్ దుర్గారాణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

నేడు ద్రాక్షారామలో సురక్ష మెడికల్ క్యాంపు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నేటి ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులతో పాటుగా గైనకాలజీ స్పెషలిస్టు ఒకరు, జనరల్ ఫిజీషియన్ ఒకరు ఈ మెడికల్ క్యాంపులో సేవలందిస్తారన్నారు. మండలంలోని అందరు ప్రజాప్రతినిధులు హాజరు కావలసిందిగా కోరారు. ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఠంలో భాద్రపద పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో శుక్రవారం భాద్రపద పౌర్ణమి పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వి.వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో విజయ దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పౌర్ణమి పూజలను పురస్కరించుకుని విజయ దుర్గా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ దండంగి సరోజని తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాతూ కాకినాడ ఇనోదయ హాస్పిటల్ నుంచి నిపుణులైన వైద్యులు పాల్గొని గుండె, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, మూత్రాశయ సంబంధిత వ్యాధులకు చికిత్స నిర్వహిస్తారన్నారు. బీపి, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేస్తారన్నారు. కాజులూరు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ తోటను కలసిన దేవాలయ ఉద్యోగులు

మండపేట: ఆలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతభత్యాల సమస్యను శాసనమండలి ద్వారా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం పట్ల దేవాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అర్చకుల ఉద్యోగులు సంక్షేమ ట్రస్ట్ సభ్యులు విత్తనాల శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం నాయకులు కోళ్ల రవికుమార్, హనుమంతరావు తదితరులు ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట కృషితో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘ నాయకులు మంచం శ్రీనివాస్, యాల సత్యనారాయణ, రఘు, వాడ్రేవు కామేశ్వరరావు, ముసిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' ను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట: ప్రజారోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అయుష్మాన్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళాలో ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొని ప్రసంగించారు. ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ రూ.ఐదు లక్షల వరకు విలువైన వైద్యసేవలను దేశంలో ఎక్కడైనా ఉచితంగా పొందవచ్చునని వివరించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు వై. వెంకట్రాజు, కొల్లి వరలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో పేద, మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. అంగర పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం వైద్యాధికారి కె.రత్నకుమారి అధ్యక్షతన ఆసుపత్రిలో నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు ఆసుపత్రి సేవలపై చర్చించారు. ఆసుపత్రి ఓపీ, మందుల నిల్వలు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై చర్చించారు. ఆసుపత్రి నిర్వహణలో ప్రభుత్వ ఆదేశాలు, సూచనలను ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లికార్జునుడు వివరించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ నిధులు నుంచి పలు పరికరాల కొనుగోలుకు సభ్యులు ఆమోదం తెలిపారు.

డంపింగ్ యార్డుకు మోక్షం

- పూర్తయిన స్థల సేకరణ
- ఎమ్మెల్సీ తోట చొరవతో మూడు దశాబ్దాల నాటి సమస్యకు తెర
- మున్సిపాలిటీకి స్వాధీనం చేసిన రెవెన్యూ అధికారులు


ఎమ్మెల్సీ తోట సమక్షంలో మున్సిపాలిటీకి స్థలాన్ని స్వాధీనం చేస్తున్న రెవెన్యూ అధికారులు


డంపింగ్ యార్డు కోసం సేకరించిన 2.75 ఎకరాల స్థలం

మండపేట: మూడు దశాబ్దాలుగా పట్టణాన్ని పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు తెరదించారు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు. గత పాలకులకు సాధ్యం కాని స్థల సేకరణను సుసాధ్యం చేశారు. డంపింగ్ యార్డు కోసం అదనంగా సేకరించిన స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ తోట సమక్షంలో రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి స్వాధీనం చేశారు.

పట్టణంలో రోజుకు 30 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతుండగా ప్రస్తుతం ఉన్న 2.5 ఎకరాల డంపింగ్ యార్డు అందుకు ఏమాత్రం సరిపోవడం లేదు. తరచూ డంపింగ్ యార్డు నిండిపోయి కొద్దిపాటి వర్షానికి చెత్త తరలింపు సాధ్యం కాక పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కష్టతరమవుతోంది. ఒక్కో ట్రక్కు వ్యర్థాలను నాలుగైదు ఇంజన్లతో పైకి తీసుకు వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో చెత్త తరలింపునకు వీలులేక పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా పారిశుధ్య లోపం తలెత్తుతోంది. గత టీడీపీ కౌన్సిల్ హయాంలో వాటర్ వర్క్స్ స్థలాన్ని చెత్తతో నింపెయ్యడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. రెండో డంపింగ్ యార్డు కోసం పక్కనే గల 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు పదేళ్ల క్రితమే రూ.1.2 కోట్ల మొత్తాన్ని రెవెన్యూ శాఖకు మున్సిపాలిటీ చెల్లించింది. కాగా స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో స్థలసేకరణ జరగలేదు. పారిశుధ్య నిర్వహణకు సమస్యగా ఉన్న డంపింగ్ యార్డు స్థల సేకరణపై ఏడాదిన్నరగా ఎమ్మెల్సీ తోట ప్రత్యేక కసరత్తు చేస్తూ వచ్చారు. తనకున్న పరిచయంతో స్థల యజమానులతో మాట్లాడి కోర్టు కేసులు విత్‌డ్రా చేయించి స్థల సేకరణకు మార్గం సుగమం చేశారు. దీంతో మూడు దశాబ్దాల కాలంగా మండపేట ప్రజలను పీడిస్తున్న సమస్యకు ఎమ్మెల్సీ తోట తెరదించారు.

స్థలాన్ని స్వాధీనం చేసిన రెవెన్యూ శాఖ

స్థల సేకరణ పూర్తి కావడంతో శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో రెవెన్యూ అధికారులు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు స్థలాన్ని స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా స్థల సేకరణ సాధ్యం కాదనుకునే వాళ్లమని, కాని దానిని చేసిన చూపించిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు స్థల సేకరణ ఎమ్మెల్సీ తోట సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత పాలకులకు సొంత పనులపై తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదన్నారు. ఏడాదిన్నరగా స్థల సేకరణకు చేసిన కృషిని వివరించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, పార్టీ నేతలు ముక్కా సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి


మంత్రి వేణును కలసిన న్యాయవాదులు

రామచంద్రపురం: కోర్టుల ప్రాంగణంలో జిల్లా కోర్టు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలను తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం జిల్లా కోర్టు సాధనలో భాగంగా మంత్రి వేణును ఆయన కార్యాలయంలో కలిశారు. రామచంద్రపురంలో జిల్లా కోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను గురించి మంత్రి వేణుకు న్యాయవాదులు వివరించారు. సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో ఈ జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, సహాయ కార్యదర్శి ఎస్.వీర్రెడ్డి, మహిళా ప్రతినిధి కేవీ సత్యవాణి, మాజీ అధ్యక్షుడు ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, డి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు వాకలపూడి జయశంకర్, వై.దుర్గాప్రసాద్, బులుసు వెంకటేశ్వరరావు, సూరంపూడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతకు పెద్ద పీట

- ప్రజల్లో అవగాహన తీసుకురావాలి
- కౌన్సిల్ సమావేశంలో మంత్రి వేణు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలో ప్రతి వార్డును స్వచ్ఛతగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఆ దిశగా ప్రజల్లో అవగాహన తీసుకురావాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పురపాలక సంఘం కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా మంత్రి వేణు పాల్గొన్నారు. తొలుత కౌన్సిల్ సమావేశంలో 10 అంశాలతో కూడిన అజెండాను సభ్యులకు మున్సిపాలిటీ అధికారులు చదివి వినిపించారు. మొదటి అంశంగా 6వ వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి వెంకటలక్ష్మి మూడు సార్లు కౌన్సిల్ సమావేశానికి రాకపోవటంతో మున్సిపాలిటీ చట్టప్రకారం కౌన్సిలర్‌గా తొలగించాల్సి ఉందని దీని నిమిత్తం కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాన్ని మొదటి అంశంగా పేర్కొన్నారు. కౌన్సిల్ విప్ సాయి ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడిశెట్టి వెంకటలక్ష్మిని కౌన్సిలర్‌గా కొనసాగించాలని కోరగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మిగిలిన 4వ అంశాన్ని మినహా మిగిలిన వాటిని సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2 సందర్భంగా పెద్ద ఎత్తున స్వచ్ఛత కార్యక్రమాలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. శానిటరీ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు అందరితో కలసి సుందర రామచంద్రపురం తీర్చిదిద్దే విధంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గాంధీ జయంతి నాడు ప్రజలను చైతన్యం చేసే విధంగా స్వచ్ఛతా ర్యాలీని నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీలో పట్టణంలోని అందరూ భాగస్వాములు అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతాపరంగా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించి స్వచ్ఛ, స్వేచ్ఛ, స్నేహ, సేవా రామచంద్రపురం ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారిలో ఇప్పటికే ఒకవైపు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచుకోవడం జరిగిందన్నారు. రెండోవైపు డ్రైనేజీ పునర్నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు పురపాలక సంఘం చేపడుతుందన్నారు. పట్టణంలో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న శ్మశాన వాటికను రూ.10 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందే విధంగా కార్యాచరణ సిద్ధమైందన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తికి మూడు రకాల టెస్టులు చేసే విధంగా కార్యాచరణ రూపొందిందన్నారు. సుగర్, బీపీ లాంటి టెస్టులతో పాటు అవసరమైన టెస్టులు చేసే విధంగా వైద్య బృందాలు సిద్ధంగా ఉంటాయన్నారు. పురపాలక సంఘంతో పాటు రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రారంభించుకోనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గొల్లపుంత కాలనీలో గడప గడపకూ..


గొల్లపుంత కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరలా సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపుంత కాలనీలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలిసి తోట ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలున్నాయా? అంటూ స్థానికులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో పనుల కోసం నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కాని పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. సీఎంగా జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావు లేకుండా వలంటీర్లు తలుపు తట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ తోట అన్నారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోతురాజు స్వామి హుండీ ఆదాయం రూ.2.84 లక్షలు


హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: మండలంలోని కేశవరంలోని గని పోతురాజు స్వామివారి హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కూసు అబ్బు ఆధ్వర్యంలో శుక్రవారం దేవదాయ శాఖ సిబ్బంది తెరిచి లెక్కించారు. ఐదు నెలల కాలానికి గాను భక్తులు కానుకల రూపంలో స్వామివారికి రూ. 2,84,195 సమర్పించుకున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు హాజరై లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గని పోతురాజు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ, సమతం పెద్ద పాపారావు, అల్లంపల్లి కిశోర్, పెరుగు రాజశేఖర్, మేఘం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

మండపేట: ధైర్యంగా ఎదుర్కోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యల నుంచి బయట పడవచ్చుని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఉపాధ్యాయురాలు ఎంకేపీ వాణి అన్నారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం బలవన్మరణాలు లేని భారతాన్ని నిర్మిద్దామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం సీహెచ్ శోభావళి, ఉపాధ్యాయుడు పి.రామచంద్రారెడ్డి, సీఆర్పీ శేషారావు, మహిళ పోలీసు వల్లీ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

రామచంద్రపురం: స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో డివిజినల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం కమిటీ చైర్‌పర్సన్ గా ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, కమిటీ సభ్యులు డి.సురేష్ కుమార్, పెంకె డీవీఆర్ గంగాధరరావు, తోకల శ్రీనివాస్ సమక్షంలో డివిజన్ పరిధిలోని 5 మండలాల తహసీల్దార్లు హాజరయ్యారు. డివిజన్ పరిధిలోని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల స్థితిగతుల గురించి ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. చార్జ్‌షీట్‌లో పెండింగ్ కేసులు, తప్పుడు కేసుల గురించి డీఎస్పీ వివరాలను తెలిపారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయండి

కాజులూరు: మండల గ్రామాల్లో 30వ తేదీ శనివారం నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్సనందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించటం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. దీనిపై ఇప్పటికే గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటా పర్యటించి సర్వే నిర్వహించారన్నారు. ఎంపీడీఓ, మండల తహసీల్దార్ల ఆధ్వర్యంలో మండల అధికారులు రెండు టీంలుగా విభజింపబడి ఈ నెల 30వ తేదీ శనివారం నుంచి అక్టోబర్ 27 శుక్రవారం వరకూ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు వేగాయమ్మపేట విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట మహాలక్ష్మమ్మ హిందూ గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ గెడ్డం అనురాధ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల అనపర్తిలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో తమ విద్యార్థులు పీజీ ఐశ్వర్య అండర్-17 బాలికల విభాగంలోను, సీహెచ్ ధనుష్ అండర్-14 బాలుర విభాగంలోను ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీఈటీని, హెచ్ఎం వడ్లమాని సోమసుందరంలను ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ అంబటి తుకారం, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుడుపూడి వెంకటరమణ, గ్రామ పెద్దలు అభినందించారు.

ఘనంగా అమృత కలశయాత్ర

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా అమృత కలశ యాత్ర నిర్వహించారు. బాలాంత్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వినూత్నంగా వేషధారణలు ధరించి జాతీయ జెండాలు, జాతీయ నాయకుల ఫొటోలను చేత పట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కలశంలో మట్టిని సేకరించారు. సేకరించిన మట్టి కలశాలను మండల విద్యా శాఖ కార్యాలయానికి పంపిస్తామని హెచ్ఎం నరాల కృష్ణకుమార్ తెలిపారు. ఉపాధ్యాయిని దుర్గాదేవి, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీవీవీ సేవలు ఆదర్శప్రాయం

కె.గంగవరం: దంగేరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన సీవీవీ సత్యనారాయణ సేవలు ఆదర్శనీయమని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో శనివారం పదోన్నతిపై పెదపూడి ఎంఈఓ-2 గా బదిలీపై వెళ్లి సీవీవీ సత్యనారాయణకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా హెచ్ఎంగా పాఠశాలలో విశిష్ట సేవలు అందించారని భవిష్యత్‌లో కూడా మంచి బోధన చేసి అందరి మన్ననలను పొందాలని కోరారు. అనంతరం హెచ్ఎం రాజుతో కలసి సీవీవీని పూలదండలు, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రంగరాజు, వాసా సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

రామచంద్రపురం రూరల్: నేడు వెంకటాయపాలెం పేపకాయల బాబ్జీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నియోజకవర్గంలోని దళిత ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత వేలాదిగా తరలిరావాలని రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వరుసగా రెండో సారి దళితులకే కేటాయించిన శుభ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

'గురు దేవోభవ' అంశంపై వ్యాస రచన పోటీలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సత్యసాయి బాబా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ×గురు దేవోభవ¥ అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పి.మెహర్ సుజాత, కె.జనార్దనస్వామి పర్యవేక్షించారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: దేశ హరిత విప్లవ పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్ సంతాప కార్యక్రమంలో మండలంలోని వెల్లలో శుక్రవారం జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, నాయకులు పాల్గొన్నారు.

అంగరలో భారీ అన్నసంతర్పణ

కపిలేశ్వరపురం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అంగర చప్పిడి పాలెం సెంటర్‌లోని ఆది గణపతి శిబిరం వద్ద శుక్రవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శిబిరం నిర్వాహకులు స్వామి పూజ, అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, టేకి తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.